# ప్రజల అభివృద్ధికి పెద్దపీట

**ఎమ్మెల్యే దానం నాగేందర్**

### -రూ.2.26కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో మురుగు సమస్యల పరిష్కారం కోసం జలమండలి ఆధ్వర్యంలో రూ.2.26కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్‌లైన్ పనులతో పాటు మంచినీటిలైన్ పనులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మంగళవారం ప్రారంభించారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్‌లో మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు రూ.40లక్షల వ్యయం తో మంచినీటి లైన్ , సీవరేజ్ లైన్‌పనులు ప్రారంభించిన అనంతరం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్‌లో రూ.32లక్షల వ్యయంతో పనులను ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. నూర్‌నగర్, సింగాడకుంట ప్రాంతాల్లో రూ.39లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల నియోజకవర్గంలో సుమారు రూ.100కోట్ల వ్యయంతో పలు బస్తీలు, కాలనీల్లో సీవరేజ్ లైన్లు వేయడంతో పాటు సీసీ రోడ్డు పనులు పూర్తిచేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల కోసం రూ.2.26కోట్లను మంజూరు చేయించామని, ఈ పనులన్నీ నెలరోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు శివకుమార్, రాంబాబుతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు జావెద్, వెంకటస్వామి, ఆంటోనీ, రాందాస్, ప్రేమ్ పాల్గొన్నారు. – బంజారాహిల్స్,అక్టోబర్ 3:



జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

**● ఇందిరానగర్‌లో రూ.1.10కోట్లతో..**

జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, జవహర్‌నగర్‌లలో రూ.1.10కోట్ల వ్యయంతో చేపట్టిన సీవరేజ్ లైన్, మంచినీటి లైన్ పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేశారు. బస్తీలోని పలు వీధుల్లో ఇప్పటికే సీవరేజ్ లైన్లను వేయడం జరిగిందని, మిగిలిన వీధుల్లో సీవరేజ్ లైన్లతో పాటు మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు రూ.1.10కోట్ల వ్యయంతో పనులు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానికులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్‌ఎస్ నాయకులు బోజిరెడ్డి, మామిడి నర్సింగరావు, డి.సింహం,సునీల్, కిరణ్‌యాదవ్ ,శంకర్, రుద్రముణి, చంద్రకళ, దీపాదేవి, కార్తీక్, పెరుక కిరణ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 16నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**-15నుంచి దేవీ శరన్నవరాత్రి వేడుకలు**

**-పాలకమండలి చైర్మన్ రామయ్య**



బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పాలకమండలి చైర్మన్ రామయ్య, ఈవో లావణ్య తదితరులు

బంజారాహిల్స్,అక్టోబర్ 3: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ పాలకమండలి చైర్మన్ సీహెచ్. రామయ్య తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను ఆలయ ఈవో లావణ్యతో కలిసి చైర్మన్ రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 16నుంచి 23 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహించనున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకో వాహనంపై స్వామివారి పల్లకీ సేవ ఉంటుందని, అక్టోబర్ 21న స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం ఉంటుందని వివరించారు. అక్టోబర్ 22న శ్రీవారి రథోత్సవం కనులపండువగా నిర్వహిస్తామన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 15న ప్రారంభమవుతాయని అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు నర్సింగ్‌దాస్, ఏ.అరుణ, వెంకటేశ్వరరావు, నవీన్, ఆదిలక్ష్మి, సంతోష్‌కుమార్, సుష్మ, సాంబశివరావు, కట్టా లక్ష్మితో పాటు ఆలయ ప్రధాన అర్చకులు వి.మురళీధర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో మద్యం విక్రయాలు

**వ్యక్తిపై కేసు నమోదు**

బంజారాహిల్స్,అక్టోబర్ 3: పంజాగుట్ట శ్మశానవాటికలో రహస్యంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5లోని దేవరకొండ బస్తీకి చెందిన అర్జున్‌సింగ్(27) గత కొంతకాలంగా పంజాగుట్ట శ్మశానవాటికలోని రహస్య ప్రాంతాల్లో మద్యం బాటిళ్లను దాచిపెట్టి అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద సంఖ్యలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అర్జున్‌సింగ్ మీద ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్3: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, ఎన్.బాల మల్లేశ్ డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రాను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణ గూడ ప్లైఓవర్ కింద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

## పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి



చంద్రానగర్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మిగౌడ్

హిమాయత్‌నగర్,అక్టోబర్3: బస్తీలు, కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం చంద్రానగర్‌లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.పారిశుద్ధ్యం,మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులను పిలిపించి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట సర్కిల్–16 ఎఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతిబాయి,ఎస్ఎస్ తిరుపతి నాయక్, నారాయణగూడ జలమండలి నారాయణగూడ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు జి.రామన్‌గౌడ్, నర్సింగ్ గౌడ్,మల్లేశ్,మహేష్ పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఖైరతాబాద్: సోమాజిగూడ డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్‌ను కోరారు. మంగళవారం జెడ్‌సీ కార్యాలయంలో ఆయనను కలిసి పలు పనులపై చర్చించారు.

## గుండె పోటుతో సీనియర్ జర్నలిస్ట్ దత్తాత్రి మృతి

హిమాయత్‌నగర్,అక్టోబర్3: సీనియర్ జర్నలిస్ట్ దత్తాత్రి (53) గుండె పోటుతో మృతి చెందడం పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆయనకు భార్య నిర్మల, ఇద్దరు కుమార్తెలు శ్రావణి, హరిణి ఉన్నారు.చిన్న కుమార్తె హరిణి రష్యా దేశంలో మెడిసిన్ చదువుతోంది.గత 30 ఏండ్లకు పైగా హిమాయత్‌నగర్ డివిజన్ ఈనాడు దిన పత్రికలో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 5:30 సమయంలో మెడ నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలుపగా హైదర్‌గూడలోని ఓ ప్రైవేటు దవాఖానకు ఆటోలో తీసుకెళ్తున్న క్రమంలో తీవ్రమైన నొప్పి వచ్చింది. దవాఖానలో వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.దత్తాత్రి మృతి చెందారనే విషయాన్ని తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయన ఇంటికి వచ్చి దత్తాత్రి పార్థివ దేహంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు



హిమాయత్‌నగర్‌లో దత్తాత్రి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

వీఎస్.బోస్, ఈ.టీ.నరసింహ,నగర ఎస్.ఛాయదేవి,ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు,రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం,నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి,ఐజెయు జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి,టీయూడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ,టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, బీజేపీ నాయకులు తదితరలున్నారు.

## కేంద్రం బీసీ కుల గణన చేపట్టాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్3: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు డిమాండ్ చేశారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో కుల గణనను చేపట్టి సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా వెనుక బడిన వర్గాలను గుర్తించి, వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. యాభై శాతం పరిమితి కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఓబీసీలకు రాష్ట్ర ప్రభుత్వాలు 27 శాతం రిజరేషన్లను అందించలేక పోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు.బీసీల జనగణన చేసి జనాభా దామాషా ప్రకారం వారి అభివృద్ధి,సంక్షేమానికి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సిగరెట్లు,నగదు చోరీ

బంజారాహిల్స్,అక్టోబర్ 3: పాన్‌షాపు తాళం పగలగొట్టి రూ.10వేల నగదుతో పాటు రూ.20వేల విలువైన సిగరెట్స్ ఇతర వస్తువులు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమం సమీపంలో ఉన్న మెట్రోపాలిటన్ పాన్ షాపు నిర్వాహకుడు ఎండీ.ఉజ్జర్ గత నెల 26 అర్ధరాత్రి సమయంలో షాపు మూసేసి ఇంటికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం వచ్చి చూడగా పాన్‌షాపునకు చెందిన తాళాలు తొలగించబడి ఉన్నాయి. షాపు తెరిచి చూడగా కౌంటర్‌లో ఉండాల్సిన రూ.10వేల నగదుతో పాటు రూ.20వేల విలువైన సిగరెట్స్,ఇతర సామగ్రి కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు సోమవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

